క్లుప్తంగా

సీఎంకు కృతజ్ఞతలు



సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న ప్రమీల, చిత్రంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ సీహెచ్ ప్రమీల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆమె ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డితో కలిసి సీఎంతో భేటీ అయ్యారు. నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా నియమించినందుకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. వీరి వెంట చక్రాయిపేట మాజీ సర్పంచ్ వెంకటప్ప ఉన్నారు.

భారీవర్షం



కొట్టాలపల్లి వద్ద జోరుగా పారుతున్న వంక

పెద్దపప్పూరు: మండలంలో గురువారం రాత్రి భారీవర్షం కురిసింది. కొట్టాపల్లి, సుంకేసులపల్లి, అత్తిరాలదిన్నె గ్రామాల వద్ద వంకలు జోరుగా పారాయి. పదునైన వర్షం కురవడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిసింది. శనగ పంటసాగుకు ఈవర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు తెలియజేశారు.

వర్షానికి కూలిన ఇల్లు

శింగనమల: ఆనందరావుపేట గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఓ ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన చిన్న నరసింహులుకు నాలుగు గదులతో ఇల్లు ఉంది. రెండు గదుల్లో బియ్యం, బీరువాలు, దుస్తులు పెట్టుకున్నారు. మరో రెండు గదుల్లో కుటుంబ సభ్యులు పడుకున్నారు. రాత్రి కురిసిన వర్షానికి వెనుక ఉన్న గదులు కూలిపోవడంతో లేచి బయటకు పరిగెత్తారు. ఘటనలో దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

బాలింతలు, గర్భిణులకు వంటల పోటీలు



విజేతకు బహుమతి అందిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది

గుత్తి రూరల్: జక్కలచెరువు ఆర్ఎస్‌లో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల తల్లులు, గర్భిణులకు శుక్రవారం వంటల పోటీలను నిర్వహించారు. పోషణ్ మాసోత్సవంలో చిరుధాన్యాలు, స్థానికంగా దొరికే ఆకుకూరలు, కూరగాయలు, మునగాకు, బాలమృతంతో రొట్టెలు, లడ్డూలు, బిస్కెట్లు, ఇడ్లీలు తయారు చేశారు. బాగా వండిన వారికి బహుమతులను అందించారు. హెచ్ఎం కల్యాణి, ఉపాధ్యాయిని సుప్రియ, అంగన్‌వాడీ కార్యకర్త రామాంజనమ్మ, గ్రామైక్య సంఘం ప్రతినిధులు మునెమ్మ, సుంకమ్మ, అపర్ణ, వెలుగు సీసీ మీనా, వీఓఏ శ్రీదేవి, ఆశా కార్యకర్త లక్ష్మీదేవి, ఏఎన్ఎం సుగుణమ్మ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

పెద్దవడుగూరు : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పెద్దపప్పూరు ఆదినారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్ల కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగభూషనకు అందజేశారు. తర్వాత అప్పేచర్ల వద్ద జాతీయ రహదారిపై బైఠాయించారు. ఎమ్మార్పీఎస్ తాడిపత్రి నియోజక వర్గ నేత పెద్దిరాజు, జిల్లా నాయకులు కత్తుల కొండయ్య, రామాంజినేయులు, మండల నాయకులు భూపతి, రంగస్వామి పాల్గొన్నారు.

వలంటీర్‌కు నివాళి



మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న మంజునాథ్‌రెడ్డి

గుత్తి రూరల్: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీకి చెందిన వలంటీర్ రంగనాయకులు మృతదేహానికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. రంగనాయకులు గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హుస్సేన్‌పీరా మృతుడి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు పరామర్శించి ధైర్యం చెప్పారు. అంత్యక్రియలకు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కౌన్సిలర్లు ఫరూక్, నరేష్, బూత్ కమిటీ పట్టణ కన్వీనర్ రంగస్వామి, నాయకులు రామసుబ్బారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

బొజ్జ గణపతికి వీడ్కోలు



నిమజ్జనానికి బయలుదేరిన భారీ బొజ్జ గణపయ్య



గణేశుని శోభాయాత్రలో చిన్నారుల కేరింతలు



బండా మసీదు వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న అర్బన్ సీఐ హమీద్‌ఖాన్



బీకేఎస్‌లో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహం



తాడిపత్రి సీబీ రోడ్డులోని పోలీస్‌స్టేషన్ సర్కిల్ వద్ద గణేశుని శోభాయాత్ర

- వైభవంగా గణేశుని నిమజ్జనం
- భారీ బందోబస్తు మధ్య శోభాయాత్ర

తాడిపత్రి అర్బన్: గణాధిపతి...సిద్ధిబుద్ధి ప్రదాత...తొలి పూజలందుకున్న గౌరీ నందనుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఐదు రోజులుగా వివిధ రూపాల్లో మండపాల్లో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చిన కొండంత దేవుడు మళ్లీ వస్తానంటూ సెలవు తీసుకున్నాడు. ఐదు రోజుల పాటు పత్రి, గరిక పూజలు అందుకుని...పండ్లు, పాయసం, ఉండ్రాళ్లు ఆరగించిన బొజ్జ గణపయ్య శుక్రవారం నిమజ్జనానికి బయలుదేరాడు. ఇందుకోసం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద గణేశుడి శోభా యాత్రను డీఎస్పీ సిఎం గంగయ్య, బీజేపీ, వీహెచ్‌పీ నాయకులతో కలిసి పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు.

సందడే.. సందడి

పట్టణంలో దాదాపు 422 విగ్రహాలకుపైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే వినాయక మండపాల వద్ద పూజలు నిర్వహించారు. కాషాయ రిబ్బన్లు, టోపీలు, జెండాలు ధరించి డప్పుచప్పుళ్ళ మధ్య నృత్యాలు చేస్తూ మధ్యాహ్నం 2 గంటలకు పోలీస్ స్టేషన్ సర్కిల్‌కు చేరుకున్నారు. ఆద్యంతం డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భారీ బాణాసంచా పేలుస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో టైలర్స్ కాలనీ యూత్ భక్తులకు భోజనంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించారు. వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి సమీపంలోని కుంటలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీఎం గంగయ్య ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తును నిర్వహించారు. ఏక్కడేగాని ఎటువంటి ఆవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక ఏర్పాటు చేశారు.

పామిడి: స్థానిక పెద్ద విఠోబదేవాలయ వద్ద లాల్‌భాగ్‌చా రాజా వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విఘ్నేశ్వరుడి నిమజ్జనం శుక్రవారం జరిగింది. వినాయకుడిని ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. అనంతంర పెన్నానదితో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో శుక్రవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా చిందులు వేశారు. అనంతరం చిక్కవడియార్ చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ నాగార్జున రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ బందోబస్తు నిర్వహించారు.

పెద్దపప్పూరు: చీమలవాగుపల్లి జాతీయరహదారి చెంతనె ఉన్న నీటి కుంట వద్ద శుక్రవారం వినాయన నిమజ్జనం జరిగింది. తాడిపత్రి పట్టణంలోని విగ్రహాలను ఇక్కడ నిమజ్జనం చేశారు. సీఐలు శంకరరెడ్డి, హమీద్‌ఖాన్, ఎస్ఐలు మహ్మద్ గౌస్,ఖాజాహుస్సేన్ బందోబస్తు చేపట్టారు.



తాడిపత్రిలో వినాయకుడి ఊరేగింపు



గణేశుడి శోభా యాత్రను ప్రారంభిస్తున్న డీఎస్పీ గంగయ్య, బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి



పెద్దపప్పూరు: వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



గౌరీపుత్రునికి వీడ్కోలు పలుకుతున్న భక్తులు

ప్రజల ఆరోగ్య భద్రత..జగనన్న ప్రభుత్వ బాధ్యత

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం మరో విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని తెలిపారు. 25వ వార్డు సచివాలయ పరిధిలో చేపట్టిన సర్వేను శుక్రవారం చైర్‌పర్సన్, కమిషనర్ మల్లికార్జున ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ లక్ష్యాలను ప్రజలకు వివరించాలని వలంటీర్లు, ఏఎన్ఎంలకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే అనంతరం ఆయా వార్డుల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్, పీహెచ్‌సీ వైద్యులు ఇతర వైద్యసిబ్బంది ద్వారా చికిత్స చేయించి మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వాస్పత్రి, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేసి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన వైద్యం, శస్త్రచికిత్సలను ఉచితంగా చేయిస్తామన్నారు.

గుంతకల్లు రూరల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ బీవీ మాధవి పేర్కొన్నారు. నెలగొండ గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీపీ బీవీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని వలంటీర్లు, గృహసారథులు, ఆశావర్కర్లకు సూచించారు. అక్టోబర్ 1 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అక్టోబర్ 12న నలుగురు వైద్య బృందం గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వైద్యంతోపాటు, మందులను అందజేస్తారన్నారు. ఈసందర్భంగా వారు సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలను విడుదల చేశారు. ఎంఎల్‌హెచ్‌ వీరేష్, పూలింగ్ బూత్ కన్వీనర్లు జయరామిరెడ్డి, దేవేంద్ర, సచివాలయ కన్వీనర్ అశోక్ పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంపీపీ మాధవి

పామిడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ కాయల మహేష్ కోరారు. శుక్రవారం సాయంత్రం అనుంపల్లిలో ఇంటింటికి వెళ్లి కార్యక్రమ బ్రోచర్లను పంపిణీ చేశారు.

ముగిసిన సామాజిక తనిఖీ గ్రామసభలు



గొడ్డుమర్రిలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం, వెన్నపూసపల్లి, గొడ్డుమర్రి, కూచివారిపల్లి గ్రామాల్లో శుక్రవారం సామాజిక తనిఖీ గ్రామసభలు ముగిసాయి. గ్రామాల్లో జరిగిన పనుల వివరాలు, ఎంత నిధులను ఖర్చుచేశారు. ఎంత మంది కూలీలు పనులు చేశారనే వాటిపై గ్రామసభలో చదివి వినిపించారు. అభ్యంతరాలు ఉన్న వాటిపై ప్రజలు, కూలీలతో చర్చించారు. కార్యక్రమంలో ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, టిఏలు ప్రతాప్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

శనివారం 10గంటలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో 17వ విడత సామాజిక తనిఖీపై ప్రజావేదిక(బహిరంగ సభ) కార్యక్రమం ఉంటుందని ఏపీఓ షబ్బీర్‌బాషా తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 22 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలను తయారు చేశారన్నారు. వాటిని బహిరంగ ప్రజావేదికలో వెల్లడిస్తారన్నారు.

నేడు ఆర్బీకే ప్రారంభం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గాంధీ నగర్ కాలనీలో శనివారం ఉదయం 10 గంటలకు డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ తెలిపారు. ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

పెద్దవడుగూరు : బాల్య వివాహాలు నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బీఎం. శ్రీదేవి, గుత్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై వర్కషాప్ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సుబ్రమణ్యం జీఓ 31,39ల్లోని అధికారుల విధులు, వారి అధికారాలను వివరించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కృష్ణమాచారి సైబర్ నేరాలను నుంచి పిల్లలను ఎలా రక్షించాలో తెలియజేశారు. బాల్య వివాహాలను అరికట్టడంతో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు కీలకంగా వ్యవరించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. పెద్దవడుగూరు, యాడికి తహసీల్దార్లు నాగభూషణ, అలెగ్జాండర్, పామిడి సీఐ రాజశేఖర్‌రెడ్డి, ప్రొటెక్షన్ ఆఫీసర్లు వెంకటేశ్వరి, చంద్రకళ , ఎంపీడీఓలు కుళ్లాయిస్వామి, లక్ష్మీనారాయణ, శివాజీ రెడ్డి, ఎంఈఓలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, సామాజిక కార్యకర్తలు నాగలక్ష్మి, వెంకటకుమార్, వసంతలక్ష్మీ, రమాదేవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

26న కసాపురంలో హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 26న హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ డీ వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమయ్యే హుండీ లెక్కింపు కార్యక్రమానికి సిబ్బంది విధిగా హాజరుకావాలని సూచించారు.

25, 26 తేదీల్లో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్

గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గం స్థాయి స్కూల్ గేమ్స్ ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పీఈటీ వెంకటేష్ శుక్రవారం తెలిపారు. అండర్ -14, అండర్-17 విభాగంలో మండల స్థాయిలో గెలుపొందిన బాల, బాలికలకు బుక్కరాయసముద్రం జెడ్పీ హైస్కూల్లో పోటీలు ఉంటాయన్నారు.

వర్షం కోసం గంగమ్మకు ప్రత్యేక పూజలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

గుంతకల్లు రూరల్: వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ కదిరిపల్లి గ్రామంలో ప్రజలు శుక్రవారం గంగమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి బోనాలతో ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, ఇతర పూజలు చేపట్టారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

పెద్దవడుగూరు: తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగభూషణ, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి తెలిపారు. మండలంలోని యువతీ యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.

నీటి సంరక్షణకు చర్యలు తీసుకోండి



కరిడికొండలో క్షేత్రదినోత్సవం నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తి రూరల్: ఖరీఫ్ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదైన కారణంగా రైతులు నీటి సంరక్షణకు పొలాల్లో చాళ్లు వేసుకోవాలని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్.సహదేవ రెడ్డి, గుత్తి ఏడీఏ వెంకట్రాముడు సూచించారు. శుక్రవారం కరిడికొండ గ్రామంలో శాస్త్రవేత్తలు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 90 రోజులలో కోతకు వచ్చేటువంటి స్వల్పకాలిక రకాలైన సజ్జ ఏబీవీ-04 రకం, కంది ఎల్ఆర్-105 రకం పంటలను పరిశీలించారు. 1:1 నిష్పత్తిలో సజ్జ, కందిలకు నీటి సంరక్షణకు తాము చాళ్లు వేసుకోవడం ద్వారా తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ 30 నుంచి 45 రోజుల మధ్య తేమను ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకొని మంచి దిగుబడులు వచ్చాయని రైతులు నాగరాజు, నాగేశ్వరరావు, శ్రీనివాసులు వివరించారు. అనంతరం శాస్త్రవేత్తలు వేరుశనగ, ఆముదం పంటలను పరిశీలించారు. ఆముదంలో తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉందని వాటి నివారణకు అసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్.చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్.నటరాజ్, డాక్టర్.శ్రీనివాసులు, వీఏఏ అజయ్, ఆర్ఏ చరణ్ పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: పంటల సాగులో మెలకువలు పాటిస్తే ఆశించిన దిగుబడిని సాధించవచ్చని రేకులకుంట వ్యవసాయ క్షేత్రం పధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి అన్నారు. శుక్రవారం యాడికి మండలం కమలపాడు, పెద్దపేట గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నటరాజులు, చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

గుంతకల్లుటౌన్: గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరుగుతున్న 36వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో గుంతకల్లు భాగ్యనగర్‌కు చెందిన టి.రాజేష్ అనే విద్యార్థి సత్తాచాటాడు. 600 మీటర్ల పరుగుపందెంలో మొదటిస్థానంలో నిలిచాడు. గతేడాది శ్రీకాకుళంలో జరిగిన అథ్లెటిక్ మీట్‌లోనూ రాజేష్ మొదటిస్థానంలో నిలిచి పూణేలోని ఆర్మీ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో సీటు సంపాదించాడు. ప్రస్తుతం స్పోర్ట్స్ అకాడమీలో 9వ తరగతి చదువుతున్న రాజేష్ అనంతపురం జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటి వచ్చే నెల 15 నుంచి 17 వరకు తెలంగాణా రాష్ట్రం వరంగల్‌లో జరిగే సౌత్‌జోన్ నేషనల్ మీట్‌కు ఎంపికైనట్లు కోచ్ దామోదర్‌రెడ్డి, టీమ్ మేనేజర్ సుదర్శన్ శుక్రవారం తెలిపారు. రాజేష్ తండ్రి మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తమ కుమారుడు అథ్లెటిక్స్‌లో రాణించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.



మెడల్ అందుకుంటున్న రాజేష్

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రి: మండలంలోని పలు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రంగారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గన్నెవారిపల్లి పంచాయతీలో ఎస్సీ మహిళ-02, వీరాపురంలో ఎస్సీ జనరల్-01, చుక్కలూరులో ఓసీ మహిళ-01, ఊరుచింతలలో బీసీ మహిళ-01, బ్రాహ్మణపల్లిలో బీసీ జనరల్-01 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 28లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తాగునీటి పథకాల పనులు త్వరగా పూర్తి చేయండి

గుత్తి రూరల్: గుత్తి ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ పరిధిలో జల్ జీవన్ మిషన్ పథకం కింద జరుగుతున్న తాగునీటి పథకాల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ కార్యాలయంలో తాగునీటి పథకాల పనులు చేస్తున్న ఎన్ఏఆర్ సంస్థ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ జేజేఎం నిధుల కింద గ్రామాల్లో నిర్మిస్తున్న పైప్‌లైన్, తాగునీటి పథకాల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు మంజునాథ్, అశ్వినికుమారి, బాలకృష్ణ, విజయ్య, ప్రసాద్‌రెడ్డి, దేవకుమార్, మహేష్‌యాదవ్, ఎన్ఏఆర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రసం పీల్చే పురుగు నివారణకు చర్యలు తీసుకోండి

పెద్దవడుగూరు : మండలంలో కొర్ర, పత్తి పంట సాగు చేసిన రైతులు రసం పీల్చే పురుగు, గులాబీరంగు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి, నటరాజు, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, గుత్తి ఏడీఏ వెంకట్రాముడు పేర్కొన్నారు. శుక్రవారం క్రిష్టిపాడు గ్రామంలో పత్తి, కొర్ర , జొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ మల్లేశ్వరి, రైతులు పాల్గొన్నారు.